

ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడేది హెల్మెట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మోటారు వాహన చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు హెల్మెట్ లేని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సమావేశంలో డిపో మేనేజరు మల్లేశ్వరరావు, డివిజనల్ మేనేజర్ కె.రవిశంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టు

- ఇప్పటికే పోర్టు, రైలు మార్గ నిర్మాణాలకు భారీగా భూసేకరణ
- ఇప్పుడు ఎక్కడి భూములు సేకరిస్తారోనని ప్రజల ఆందోళన

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి నాలుగు ఎయిర్‌పోర్టులు కావాలని కోరడంతో, కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి ట్వీట్ చేశారు. అందులో శ్రీకాకుళం జిల్లా మూలపేట ఉంది. ఇప్పటికే మూలపేటలో పోర్టు నిర్మాణం జరుగుతుండగా, ఇప్పుడు ఎయిర్‌పోర్టు జత కానుంది. కేంద్ర విమానయానశాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉండడంతో వేగంగా ఆచరణలోకి రావచ్చునే చర్చలు ఊపందుకున్నాయి. పోర్టు నిర్మాణానికే భారీగా భూములు సేకరించారని, రైలు మార్గానికి భూములను సేకరిస్తుండగా, ఇప్పుడు ఎయిర్‌పోర్టు కోసం ఎక్కడ ఎన్ని ఎకరాలను సేకరిస్తారోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది.

భూసేకరణపై ప్రజల ఆందోళన

గత వైసిపి ప్రభుత్వం మూలపేటలో పోర్టు నిర్మాణాన్ని ప్రారంభించి పనులు చేపట్టింది. ఇందుకోసం మొదటి దశలో 1010 ఎకరాలను సేకరించారు. అందులో ఉప్పు భూములు 235 ఎకరాలు, అటవీ భూమి మూడు ఎకరాలు, రెవెన్యూ భూములు 267 ఎకరాలు, జిరాయతీ భూములు 320, ఇతరత్రా (గ్రామకంఠంతో కలిపి) 185 ఎకరాలను సేకరించారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాలను తరలించేందుకు ఆర్ అండ్ ఆర్ సిద్ధం చేసి చర్యలు చేపట్టారు. ఆ పనులన్నీ కొలిక్కి రావడం, అంతలోనే ప్రభుత్వం మారిపోవడంతో మూలపేట పోర్టు నిర్మాణంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆ పనులను అదే వేగంతో చేపడుతోంది. తాజాగా మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టు నిర్మిస్తారన్న ప్రకటనతో స్థానికులు కొందరు హర్షం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోర్టు నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజలు భూములు కోల్పోయి నిర్వాసితులయ్యారు. ఆ భూముల్లో ఎర్త్ లెవలింగ్ పనులు కూడా జరిగిపోయాయి. అంతేకాకుండా స్పీడ్ యాక్సిస్ రోడ్డుకు భూసేకరణ చేసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. మరోవైపు రైలు మార్గానికి భూసేకరణ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రకటించిన ఎయిర్‌పోర్టు మూలపేటకు సమీపంలోనే నిర్మిస్తామని చెప్పడంతో ఎక్కడ నిర్మిస్తారు? ఎవరి భూములను సేకరిస్తారోనన్న ఆందోళన పరిసర ప్రాంత గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతోంది. నౌపడ పరిసర ప్రాంతంలో సుమారు ఐదు వేల ఎకరాలు ఉప్పు భూములు ఉన్నాయి. అవికాకుండా తంపర భూములు ఉన్నాయి. ఇప్పటికే మండలంలో కాకరపల్లి పవర్‌ప్లాంట్ పేరుతో వేలాది ఎకరాలు సేకరించి ఈస్ట్‌కోస్ట్ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టుకు తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయదలిస్తే ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వీటన్నింటిపై విశ్లేషణ చేసుకుంటూ సంతబొమ్మాళితో పాటు టెక్కలి నియోజకవర్గంలోని ప్రజల్లోనూ విభిన్న అభిప్రాయాలతో చర్చ సాగుతోంది. ఇదంతా రియల్ ఎస్టేట్ స్టంటేనని, భూముల ధరలు విపరీతంగా పెరగడానికే అని కొందరు చెప్తుండగా, ఈ ప్రాజెక్టులతో ఈ ప్రాంత అభివృద్ధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని మరికొందరు చర్చించుకుంటున్నారు.

మరికొద్ది రోజుల్లో స్పష్టత

జిల్లాలో సుదీర్ఘ తీర ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. బహుళార్థ సాధక ప్రాజెక్టుల రూపకల్పనకు యోచిస్తోంది. ఇటీవల భోగాపురం విమానాశ్రయ పనుల సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోగాపురం నుంచి మూలపేట వరకు ఆరు వరుసల కోస్టల్ కారిడార్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. జాతీయ రహదారికి కోస్టల్ కారిడార్‌కు మధ్య అనుసంధాన రహదారులు ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విశాఖపట్నం నుంచి మూలపేట వరకు సీడ్ యాక్సెస్ రహదారిగా అభివృద్ధి చేయడంతో పర్యాటకరంగం, చేపల ఎగుమతులు, శీతల గిడ్డంగుల ఏర్పాటు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టుకు సంబంధించి మరికొద్ది రోజుల్లో పూర్తి స్పష్టత రానుంది.

- అంతర్రాష్ట్ర వివాదాలతో అపరిష్కృతంగా నేరడి బ్యారేజీ
- 2017లో ట్రిబ్యునల్ అనుకూల తీర్పు
- బ్యారేజీ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులూ అంగీకారం
- రాష్ట్ర ప్రయోజనాలను ఎన్‌డిఎ కాపాడుతుందా?



కాట్రగడ వద్ద ప్రతిపాదిత నేరడి బ్యారేజీ నిర్మాణ ప్రాంతం

వివాదం కొలిక్కి వచ్చేనా..?

నేరడి బ్యారేజీపై సిక్కోలు ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. అంతర్రాష్ట్ర వివాదాలతో అపరిష్కృతంగా ఉన్న నేరడి బ్యారేజీకి ముగింపు దొరకగలదని అంతా భావిస్తున్నారు. బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్రానికి అనుకూలంగా ఇప్పటికే ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. బ్యారేజీ కోసం 106 ఎకరాలను సేకరించి ఇవ్వాలని ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు ఒడిశా రైతులూ భూములు ఇచ్చేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. అంతకంటే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేంద్ర ప్రభుత్వంలో బిజెపి, దాని భాగస్వామ్యపక్షాలు అధికారంలో ఉన్నాయి. నేరడి వివాదం పరిష్కారానికి అంతా సానుకూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పాలకులు చిత్తశుద్ధి కనబరిస్తే ప్రాజెక్టు పట్టాలెక్కడం ఖాయమనే అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధారలో లభ్యమయ్యే 115 టిఎంసిల నీటిలో 50 శాతం వినియోగించుకునేందుకు 1962 సెప్టెంబరు 30వ తేదీన ఎపి, ఒడిశా రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలం కాట్రగడ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా అంగీకారం తెలిపింది. 1986లో అప్పటి ఎపి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, ఒడిశా సిఎం బిజూపట్నాయక్ మధ్య ముఖాముఖి చర్చలు సైతం జరిగాయి. ఆ తర్వాత 2000లో అధికారంలోకి వచ్చిన ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజెడి, బిజెపి సంకీర్ణ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణానికి పలు అభ్యంతరాలు చెప్తూ వస్తోంది. ఆ తర్వాత ఒడిశా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమస్యను నివేదించడంతో 2010లో కేంద్ర ప్రభుత్వం వంశధార ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఇరు రాష్ట్రాలను పలు సందర్భాల్లో సందర్శించిన ట్రిబ్యునల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా బ్యారేజీ నిర్మాణానికి అనుమతినిస్తూ వంశధార నదీ జల వివాదాల ట్రిబ్యునల్ సెప్టెంబర్ 13, 2017లో తీర్పునిచ్చింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన 106 ఎకరాలను సేకరించి ఇవ్వాలని ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేంద్ర జలవనరుల కమిషన్ ఆధ్వర్యంలో ఎపి, ఒడిశా ప్రభుత్వాలు ఉమ్మడిగా సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ట్రిబ్యునల్ సూచించింది. దీంతోపాటు భామిని మండలం కాట్రగడ నుంచి సైడ్‌వియర్ కెనాల్ నుంచి ఎనిమిది టిఎంసిల నీటిని వాడుకునేందుకు సైతం అవకాశం కల్పించింది.

ఎపి ప్రయోజనాలు కాపాడుతారా?

వంశధార జల వివాదం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడానికి రాజకీయ అంశాలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒడిశా, ఎపిలో వేర్వేరు రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడంతో చర్చలకు ఎవరూ పెద్దగా చొరవ చూపలేదు. వైసిపి ప్రభుత్వ హయంలో కొంత ప్రయత్నం జరిగినా అవి ఫలించలేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2021, నవంబరులో భువనేశ్వర్ వెళ్లి ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారు. ఇరు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో ఒక కమిటీని సైతం ఏర్పాటు చేసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం కేంద్రంలో ఎన్‌డిఎ, ఎపిలో ఎన్‌డిఎ, ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేరడి పరిష్కారానికి సానుకూల వాతావరణం ఏర్పడింది. టిడిపి సభ్యుల మద్దతుతో ఏర్పాటైన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతమేరకు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతుందో, లేదో చూడాల్సి ఉంది. మరోవైపు బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా సరిహద్దు భాగంలోని బడిగాం, సర ప్రాంతాల్లో రైతులకు సరైన ప్యాకేజీ ఇస్తే భూములు ఇచ్చేందుకూ సిద్ధంగా ఉన్నారు. ఎపి ప్రయోజనాలు కాపాడాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి, కేంద్రాన్ని, ఒడిశాని ఒప్పించి రాష్ట్ర ప్రయోజనాలు దక్కించుకోవాలన్న సంకల్పం రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఉంటే నేరడి కల నేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి సర్వేకు నిరాకరణ

ట్రిబ్యునల్ ఆదేశాలతో ఎపి ప్రభుత్వం నుంచి ఇంజినీరింగ్ అధికారులు సిద్ధమైనా ఒడిశా అధికారుల నుంచి రాలేదు. పైగా మీరే భూమి వివరాలు చెప్తున్నారు కనుక మీ దగ్గర ఉన్న క్షేత్రస్థాయి సమాచారం సరిపోతుందంటూ సర్వేకు సహకరించలేదు. 2019లో ఒడిశా అధికారులు సర్వేకు రాని విషయాన్ని ఎపి ఇంజినీరింగ్ అధికారులు 2019 ఏప్రిల్‌లో ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు.

2019లో మేలో వచ్చిన ఫొని తుపాను వల్ల తమను వేర్వేరు ప్రాంతాలకు విధులకు కేటాయించడం వల్ల సర్వేకు వెళ్లలేకపోయామని ఒడిశా ఇంజినీరింగ్ అధికారులు ట్రిబ్యునల్‌కు వివరణ ఇచ్చుకున్నారు. ఇదిలా ఉండగా ట్రిబ్యునల్ తీర్పుపై ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో వివాదం కొనసాగుతోంది.

'ఆశా'లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జిల్లాలో ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని, వాటిని నివారించాలన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనాలు, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. 18 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా, ఆశావర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. తక్షణమే కార్మికులుగా గుర్తించి ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రాజకీయ వేధింపులతో ఎవరినీ తొలగించబోమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటికీ జిఒలు ఇస్తామని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

శాంతిభద్రతల్లో రాజీ వద్దు

- గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- ఎమ్మెల్యే ఎం.గోవిందరావు

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడొద్దని పోలీసు అధికారులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని సిఐలు, ఎస్‌ఐలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, వాడకంపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇటీవలి కాలంలో ఆలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు చేస్తూ ప్రజలతో స్నేహ, సేవాభావంతో మెలగాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సక్రమంగా పనిచేసే అధికారులకు గుర్తింపుతో పాటు ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో కొత్తూరు సిఐ వేణుగోపాలరావు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు ఎస్‌ఐలు మహ్మద్ యాసిన్, రాజేష్, నారాయణస్వామి, ఎం.ఎ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంతో నష్టం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన విద్యా విధానం విద్యారంగానికి తీవ్ర నష్టదాయకమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రామ్మోహన్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పేద విద్యార్థికీ ఉచిత విద్య అందాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ పోటీ పరీక్ష అయిన నీట్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. నీట్ పరీక్షలో అవకతవకల వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చెందుతున్నా, జరిగిన తప్పులను అంగీకరించే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలలు, కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కాలంలో యువత సెల్‌ఫోన్లకు బానిస అవుతున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో మునిగి తేలుతూ విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. సెల్‌ఫోన్ చదువుకు అడ్డం కాకూడదన్నారు. చదువుకునేందుకు విషయ పరిజ్ఞానం అవసరమని, సెల్‌ఫోన్‌లో వాటిని తెలుసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. దీన్ని విద్యకు ఉపయోగించకుండా వ్యసనంగా మార్చుకుని నిరంతరం అందులోనే మునిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ భవిషత్‌లో విద్యారంగంలో వస్తున్న మార్పులపై పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్.రాజు, ఎం.సంతోష్, టి.తిరుపతి, గర్ల్స్ కమిటీ నాయకులు పవిత్ర, రాణి, మోహిని, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

పక్కాగా వసతిగృహాల నిర్వహణ

ప్రజాశక్తి - కవిటి

వసతిగృహాల నిర్వహణ పక్కాగా చేపట్టి, విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని వార్డెన్లకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వసతిగృహాల సలహా సంఘ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాలు వ్యాధులకు నిలయాలుగా మారకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ఎక్కడికక్కడ వ్యాధులు విజృంభిస్తున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వసతిగృహాల పరిసరాల్లో పూర్తిస్థాయి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారికి పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. మొక్కుబడి వ్యవహారంలా కాకుండా పూర్తిస్థాయి మెనూ అందించాలని ఆదేశించారు. బడుగు, బలహీనవర్గాలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వసతిగృహాలు నిర్వహిస్తోందని, ప్రభుత్వ లక్ష్యాన్ని గుర్తించి సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి రఘు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని వసతిగృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

దొరికినంత దోచుకున్నారు

భూ దందాలు, సహజ వనరులతో దోపిడీతో గత ప్రభుత్వం దొరికినంత దోచుకుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసిపి పాలనలో అక్రమాలు, దోపిడీలను ప్రజలకు తెలియజేసేందుకే ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తోందని తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రూ.35,576 కోట్ల విలువ గల 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగినట్టు ఆరోపించారు. చేసిన ప్రతి తప్పుకీ శిక్ష తప్పదని, దోచుకున్న ప్రతి రూపాయి చెల్లించాల్సిందేనన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

రైతుబజారులోనే విక్రయించాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కూరగాయలు విక్రయించే వ్యాపారులంతా రైతులతో పాటు రైతుబజారులోనే విక్రయించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానిక రైతుబజారును బుధవారం సందర్శించి కూరగాయల విక్రయదారులు, రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యాపారులు మెయిన్ రోడ్డుపై ఉన్న కూరగాయల షాపుల్లో కూరగాయలు విక్రయించడం వల్ల కొనుగోలుదారులు ఎవరూ రైతుబజారుకు రావడం లేదని తెలిపారు. దీంతో వ్యాపారాలు లేక నష్టాల పాలవుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెయిన్ రోడ్డుపై కూరగాయలు అమ్మితే వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ, పంచాయతీ ఇఒ చింతాడ శ్రీనివాస్‌ను ఆదేశించారు. వ్యాపారులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు రైతుబజారులో కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు పార్కును పరిశీలించారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక కెజిబివి పాఠశాలను సందర్శించి ఇటీవల విద్యార్థులు డయేరియా బారిన పడడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు టి.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com



సోంపేట : వినతిపత్రం అందజేస్తున్న ఈశ్వరరావు

మత్స్యకారులకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

వెనుకబడిన మత్స్యకారులకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించేలా నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని జనసేన రాష్ట్ర సహాయ కార్యదర్శి బైపిల్లి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళగిరిలో బుధవారం మరో సహాయ కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, జనసేన నాయకులు తేజాలి, శివలతో కలిసి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వేట నిషేధ సమయంలో ప్రకటించిన సాయాన్ని అందించాలని విన్నవించారు.

మంత్రి దృష్టికి ఇచ్ఛాపురం సమస్యలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళగిరిలో బుధవారం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీరితో పాటు బైపల్లి ఈశ్వరరావు, తేజాలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

శ్వేతపత్రాల పేరుతో చంద్రబాబు విష ప్రచారం

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకే వారానికో శ్వేతపత్రం పేరుతో సిఎం చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డిపై విష ప్రచారం చేస్తున్నారని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం బొడ్డేపల్లిపేట వద్ద జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు జీవిత విధానం చేసిన శ్వేతపత్రంలో గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో లక్షా 7వేల ఎకరాల భూమిని అలాగే పేదల అసైన్డ్ భూములను జగనన్న అన్యాక్రాంతం చేశారని అబద్ధాలు చెబుతున్నారన్నారు. ప్రస్తుత చంద్రబాబే అధికారంలో ఉన్నారని రాష్ట్రంలో ఏ గ్రామంలో, మండలంలో ఏ సర్వే నెంబర్ ఎవరి భూములను జగన్మోహన్ రెడ్డి అన్యాక్రాంతం చేశారో చంద్రబాబు నిరూపించాలని సవాల్ విసిరారు. అలాగే కేంద్రంలో చక్రంతిప్పి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగ ఉపాధ్యక్షులు కొవ్వల ఈశ్వరరావు, వైసిపి నాయకులు నరసింహ, రామ్మోహన్, రామచంద్రరావు పాల్గొన్నారు.

డిఐజిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



విశాఖపట్నం రేంజ్ నూతన డిఐజిగా బాధ్యతలు చేపట్టిన గోపీనాథ్ జెట్టిని ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి బుధవారం కలిశారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పచ్చని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేరం చేసిన వారిని ఉపేక్షించేది లేదు

డిఎస్‌పి శృతి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి శృతి

ప్రజాశక్తి- బూర్జ

నేరం చేసిన వారిని నేరం చేయమని చెప్పి ప్రోత్సహించే వ్యక్తులను ఉపేక్షించేది లేదని అలాంటి వారు ఎవరైనా సరే చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీకాకుళం డిఎస్‌పి శృతి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని కొల్లివలస గ్రామ జంక్షన్ వద్ద చీడివలస గ్రామస్తులు గత మూడు రోజులుగా అసలు దొంగలను అరెస్టు చేయాలని ధర్నాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా చీడివలస గ్రామస్తులతో డిఎస్‌పి మాట్లాడారు. ఈ మండలంలో జీవీల జరిగిన దొంగతనాలకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అయితే దొంగతనాలకు ప్రోత్సహించే వ్యక్తిని విడిచిపెట్టడంతో వాళ్లు విచ్చలవిడిగా ప్రజల మధ్య తిరుగుతున్నారని, వారిని అరెస్టు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు డిఎస్‌పిని ప్రశ్నించారు. దీనిపై డిఎస్‌పి మాట్లాడుతూ తప్పు చేసిన వ్యక్తి ఎవరైనా అరెస్ట్ చేయక తప్పదన్నారు. ప్రజలు అపోహాలను విడనాడాలన్నారు. ముఖ్యంగా ప్రజలు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవడం సరికాదని, దీనివలన పలు సమస్యలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించరాదన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి వాటికోసం దొంగతనాలకు పాల్పడుతున్నారని, దీనివలన వారి బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆమెతో పాటు ఎస్‌ఐ జి.వి.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాసరి రాజు

నేటి నుంచి సభ్యత్వ నమోదు

ఇచ్ఛాపురం: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాసరి రాజు పిలుపునిచ్చారు. జనసేన కార్యాలయంలో జనసైనికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28 వరకు నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. జనసైనికులకు, వీర మహిళలకు, కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సభ్యత్వ నమోదు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, మండల అధ్యక్షులు దుర్గాసి నీలవేణిరెడ్డి, కంచిలి మండల అధ్యక్షులు డొక్కరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పొందూరు: ఈనెల 18 నుంచి 28 వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నం నాయుడు, పార్టీ కార్యనిర్వాహణ కమిటి సభ్యులు గార బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి జనసేన నాయకుడు, కార్యకర్తలు, వీర మహిళలు అందరూ పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాద బీమా రూ.5లక్షలు, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50వేలు కుటుంబానికి అందించడం జరుగుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రసాద్

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

మెళియాపుట్టి: ఉపాధి హామీ కూలీల ఆరు వారాల కూలి బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు వారాలుగా కూలి చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 150 రోజులు పని కల్పిస్తూ... అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సుందరరావు, మల్లేసు, రాము పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



ఇచ్ఛాపురం : పట్టణంలో బుధవారం ఘనంగా మొహరం నిర్వహించారు. మొహర్రం నెల ముస్లిముల కొత్త సంవత్సరం. ఈ నెలలో మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం. దీనిని పీర్ల పండగ కూడా పిలుచుకుంటారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని పంజా స్థలంలో పీర్ల పంజా ముతవల్లి రబ్బానీ ఆధ్వర్యాన నిర్వహించారు. అలాగే కంద్ర వీధిలోని మౌలాలి పంజానూ మొహరం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అమీర్ అలీ, జూలాలి, జోహర్ ఖాన్, అబ్దుల్, ఇసాఫ్ ఖాన్, అలిమ్ ఖాన్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

మండలంలో జాడుపల్లికి చెందిన అదపాకల శ్రీధర్ (50) మహేంద్ర తనయా నది సమీపంలో శ్మశానవాటి కవాటర్ ట్యాంకు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తలకు బలమైన గాయాలు ఉండడం పలువురు అనుమానిస్తున్నారు. తాగిన మైకంలో వాటర్ ట్యాంకు వద్ద అదుపు తప్పి పడడంతో తలకు గాయాలై మృతి చెంది ఉంటాడని కొంతమంది భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. మృతుడికి భార్య సుగుణ, కుమార్తె జాను, కుమారుడు విగ్నేష్ ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



పోతయ్య మృతదేహం

టెక్కలి చేరివీధి సమీపంలో బుధవారం విద్యుదాఘాతంతో బతకల పోతయ్య (58) మృతి చెందారు. స్థానికంగా ఉన్న ఓ గొడౌన్ మెడపైన విద్యుత్ పనులు చేస్తున్నారు. ఒక్కసారిగా విద్యుత్ హై టెన్షన్, మెయిన్ లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అస్వస్థతకు చేరుకున్నారు. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య జయ, సంతోష్, ఇంద్రజ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక నివగాం రోడ్డులోని ఓ చికెన్ సెంటర్ వద్ద భార్యపై భర్త కత్తితో బుధవారం దాడి చేసి గాయపరిచాడు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని పారాపురానికి చెందిన ఊర్లాపు గణపతిరావుతో పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బాలేరుకు చెందిన సావిత్రిని 12 ఏళ్ల క్రితం కుటుంబ పెద్దలు వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గణపతిరావు నివగాం రోడ్డులోని ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. వీరిమధ్య తరచూ గొడవలు జరగడంతో ఆరు నెలల క్రితం ఆమె కన్న ఊరు బాలేరు వెళ్లిపోయింది. బుధవారం గ్యాస్ పుస్తకం ఇచ్చేందుకు భర్త పనిచేస్తున్న షాపు వద్దకు వచ్చింది. ఈ సమయంలో వీళ్లిద్దరూ మళ్లీ ఘర్షణ పడ్డారు. దీంతో గణపతిరావు కోపోద్రిక్తుడై భార్య ఛాతిపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు 108లో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ ఎ.అహమ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గ్రామానికి వీర జవాను మృతదేహం

నౌపడ : సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన ఆర్మీ జవాన్ డొక్కరి రాజేష్ మృతదేహం గురువారం ఉదయం గ్రామానికి వస్తున్నట్లు తమకు సమాచారం అందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. జమ్మూ- కాశ్మీర్‌లోని ద్వాడా జిల్లాల్లో ఉగ్రవాదుల ఏరువేతే లక్ష్యంగా ఆ రాష్ట్ర పోలీస్ శాఖతో సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్‌లో పాల్గొని ఉగ్రవాద తూటాలకు వీర జవాన్ రాజేష్ అమరుడైన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు తమ సాను భూతిని వ్యక్తం చేస్తూ... ఆ కుటుంబానికి అండగా ఉంటాయని తన సంతాపాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వీరజవాన్ మృతదేహం విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు బుధవారం రాత్రి చేరుకుని అక్కడి నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. ప్రభుత్వం అధికారుల అంచనాలతో జవాన్ మృతదేహానికి అంత్యక్రియలు జరపనుంది.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూడ్స్ రైలు వేగన్‌లో పొగలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు నుంచి బుధవారం పొగలు వ్యాపించాయి. దీంతో గూడ్స్ రైలు సుమారు రెండున్నర గంటలు నిలిచిపోయింది. సంబల్పూర్ డివిజన్ తాల్చేరు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు తీసుకుని వెళ్తున్న గూడ్స్ రైలు సాయంత్రం 6 గంటల ఐదు నిమిషాలకు పూండి స్టేషన్ చేరుకుంది. ఈ సమయంలో 16వ నంబరు బోగీలో మంటతో పాటు పొగలు రేగాయి. పలాస వైపు వెళ్లే వేరే రైలులోని గార్డ్ దీనిని గమనించి గుడ్స్ గార్డ్ జయప్రకాష్ యాదవ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై పూండి స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారంపై రైలు నిలిపి స్టేషన్ మస్టర్ ఎన్.పాడికి సమాచారం అందించారు. స్టేషన్ మాస్టర్ విశాఖపట్నంలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చి ఉన్నతాధికారులు సూచనలతో పలాసలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని ఇచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మన్మథరావు, రామినాయుడు, గోపాల్, ప్రేమ్‌కుమార్, విష్ణులు శకటంతో హుటాహుటిన పూండి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైలు పైకెక్కి నీటితో పొగలు రాకుండా అదుపు చేశారు. అదే ట్రాక్‌లో రావలసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లేకుండా లూపు ట్రాక్‌లో మళ్లించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాటు చేశారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న భానుమూర్తి

ఉపాధ్యాయ, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న సిపిఎస్ విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలన్నారు. నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్‌లో సంఘ జిల్లా సబ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కోసం కమిటీని నియమించి కసరత్తు ప్రారంభించాలన్నారు. పిఆర్‌సి ప్రకటించే వరకు మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి మాతృ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. రేషనలైజేషన్‌కు కారణమైన జిఒ నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ప్రకటించాలని కోరారు. కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలు, సర్వీసు రూల్స్ ప్రకటించి అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య, సర్వీసు సమస్యలు పరిష్కరించాలని పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, జి.భీమారావు, కె.గోపీకృష్ణ, బి.నేతాజీరావు, చావలి శ్రీనివాస్, ఎస్.చాణుక్య, వి.నవీన్‌కుమార్, దాసరి రామ్మోహనరావు, పి.తిరుమలరావు పాల్గొన్నారు.

ధరణి ఆస్పత్రి ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : వెనుకబడిన జిల్లాగా పేరుబడిన శ్రీకాకుళంలో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో నూతనంగా నెలకొల్పిన ధరణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి అయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆస్పత్రిని ప్రారంభించిన అయన యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ దానేటి ధరణేష్ బాబు, డాక్టర్ గురుగుబెల్లి యమున రాణిలను అభినందించారు. జిల్లావాసుల స్థితిగతులపై అవగాహన ఉన్న వ్యక్తులుగా వ్యాపార కాంక్షతో కాకుండా సేవాదృక్పదంతో వైద్య సేవలందించి అభివృద్ధి చెందాలని కోరారు. గతంలో వైద్యం కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. ప్రజలు ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దానేటి రమేష్ బాబు, ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, విశ్రాంత డిఇఒ పల్లి నర్సింహులు, ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

భూములను కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం పంచాయతీ పరిధిలో బారువ రైల్వే స్టేషన్‌కు ఆనుకుని ఉన్న బ్రాహ్మణ కొర్లాం కాలనీ వాసుల స్థలాల్లో రైల్వే శాఖ అధికారులు నిర్మాణాలు చేపట్టారని, ఆ భూములకు రక్షణ కల్పించాలని బాధిత రైతుల తరుపున సర్పంచ్ ప్రతినిధి రాంబడ్డి గణపతిరావు కోరారు. ఈ మేరకు కవిటి మండలం రామయ్యపుట్టులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేశాఖ 2021 రైతులకు తెలియకుండా భూములు సర్వ చేసి 5 మీటర్లకు ఎక్కువ ఆక్రమణల జరిగిందని అన్నారు. ప్రస్తుతం ప్రహరీని నిర్మిస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని విన్నవించారు. అలాగే అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తామాడ వాసు, టిడిపి నాయకులు రాంబుడ్డి జానకిరావు, జనసేన నాయకులు చందు, రైతులు మాధవరావు, కేశవరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలం తొగరాం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించుట, విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 19న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రూరల్ సెక్షన్ పరిధిలోని 11 కెవి జి.కె.వలస ఫీడర్ పరిధిలో నిమ్మతొర్లాడ, జి.కె.వలస, కొరపాం, సీపానిపేట, పాతూరు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి తమ శాఖకు సహకరించాలని కోరారు. అలాగే పట్టణ పరిధిలోని 33/11 కెవి సొట్టవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో పురపాలక సంఘ పరిధిలోని పంతులుపేట, సొట్టవాని పేట, ఎఫ్‌సిఐ, కాళింగ మన్నయ్యపేట, తెలగ మన్నయ్య పేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవాని పేట, నాదానపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

సరుబుజ్జిలి: మండలంలోని సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి రొట్టవలస ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించుట ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు తదితర పనులు కారణంగా ఈ నెల 19న ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఇఇ బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. సరుబుజ్జిలి, మర్రిపాడు, బురిడివలస, షలంత్రి, కొత్తకోట, డకరవలస, చిగురువలస, సుభద్రాపురం, రొట్టవలస, పాలవలస, కొండవలస, పెద్దపాలెం, వెంకటాపురం, పురుషోత్తపురం, అలమాజీపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

టిడిపి ఆగడాలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామాల్లో టిడిపి నాయకులు చేస్తున్న ఆగడాలను తిప్పికొడతామని వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు పుక్కల్ల గురయ్యానాయుడు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇవిఎం ట్యాంపరింగ్, ధన ప్రభావం వల్ల టిడిపి నాయకులు విజయం సాధించారని ఆరోపించారు. టిడిపి మానిఫెస్టో తుచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కిందిస్థాయి నాయకుల మనోభావాలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని నాయకులను కోరారు. కిందిస్థాయి కేడర్‌కు నష్టం కలుగుతున్న చోట లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. గ్రామాల్లో అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, సిఎఫ్‌లు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను విధుల నుంచి తొలగిస్తే కలిసికట్టుగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరావు, వైస్ ఎంపిపి వంక రాజు, మండల విప్ తిత్రి గుణరాజారావు, ప్రేమ్‌కుమార్, శేషయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మెమోంటోలతో విద్యార్థులు

విద్యార్థులకు నగదు పురస్కారం

మెళియాపుట్టి: విద్యార్థులు ఇష్టపడి చదవాలని, అప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని భోగాపురం సబ్ రిజిస్టర్ కంచరన్ రోహన్ కుమార్ అన్నారు. మండలంలోని కరజాడ ఉన్నత పాఠశాలలో దుప్పల ఆంజనేయమూర్తి జ్ఞాపకార్థం ఏటా జరుగుతున్న ప్రతిభా పురస్కారాన్ని విద్యార్థులకు బుధవారం అందజేశారు. ముందుగా ఆంజనేయమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య సమాజానికి అవసరమని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన దాసరి సూర్య కుమార్‌కి రూ.15 వేలు, బొండాడ మధుసూదన్‌కు రూ.పది వేలు, పల్లి జ్యోత్స్నకు రూ.5 వేలు, మల్లారెడ్డి ధర్మతేజకు రూ.5 వేలు నగదు, మెమోంటోలు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజశేఖర్, ఎంపిటిసి డి.రవికుమార్, ఐటిఐ ప్రిన్సిపల్ పైల జవహర్, జిల్లా కన్స్యూమర్ క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్.వి.చలం, సంజయ్‌కుమార్, వి.వెంకటరావు, నెమలిపురి సోమేశ్వరరావు, కె.ఝాన్సీ, భరణికోట ఎంపిటిసి మాజీ సభ్యులు దువ్వాడ బాలరాజు, తలగాన నరసింహులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్ : న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే క్లబ్ లక్ష్యమని, ప్రస్తుత రోజుల్లో న్యాయవ్యవస్థ సామాన్యుడికి న్యాయం కలిగేలా పలు చట్టాలు అందుబాటులోకి వచ్చాయని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని నగరంలో ఓ ప్రయివేటు హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఐక్యంగా న్యాయం కోసం పోరాడేందుకు సహకరించాలన్నారు. నేరాల నుంచి ప్రజలను రక్షిచడంతో పాటు దేశ శాంతిభద్రత, శ్రేయస్సుకు భంగం కలిగించే వ్యక్తులకు హెచ్చరికగా న్యాయ వ్యవస్థ ఉందన్నారు. ఈ సందర్భంగా నగరంలో ప్రముఖ సీనియర్ న్యాయవాదులను అభినందించి, జ్ఞాపికలు అందించి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్, డిసి బి.దేవ భూషణం, సభ్యులు శిల్లా మణి, గుత్తు చిన్నారావు, పొడుగు చరణ్, బి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.



సీనియర్ న్యాయవాదులను సత్కరిస్తున్న డాక్టర్ సురేష్



గిరిజన రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త సునీత

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పైనాపిల్ విలువాదారిత ఉత్పత్తులతో ఆదాయాభివృద్ధి సాధ్యమని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన రైతులకు మూడోరోజు వృత్తి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన మండలాలైన సీతంపేట, వీరఘట్టం, కొత్తూరు, పాలకొండ, హిరమండలం, భామిని, మెళియాపుట్టి, బూర్జ, మందస మండలాల్లో ఎక్కువగా పైనాపిల్‌ను పండిస్తారని జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువగా దొరికే పైనాపిల్ రుచితో పాటు ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటాయన్నారు. దీనిలో బ్రొమిలిన్ అనే ఎంజైమ్ అధికంగా ఉండడం వలన ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడంలో ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. పైనాపిల్‌లో విటమిన్ సి, ఆస్కార్బిక్ యాసిడ్, పొటాషియం, పీచు పదార్థం, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి వాటితో పాటు పొటాషియం వంటి స్థూల పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు. పైనాపిల్ ఎక్కువగా వర్షాకాలం నెలల్లో అధికంగా లభిస్తాయని, వీటిలో నీటిశాతం అధికంగా ఉండటం వలన కోత అనంతరం త్వరగా పాడైపోతాయని, రవాణా సదుపాయాలు, సరైన మార్కెటింగ్ లేకపోవడం వంటి ప్రధాన సమస్యతో అధిక శాతం పంటను నష్టపోవడం జరుగుతుందన్నారు. పైనాపిల్‌తో జామ్, స్క్వాష్ క్యాండీ పచ్చడి, పైనాపిల్ పచ్చడి వంటి ఉత్పత్తులను తయారు చేయవచ్చునన్నారు. గడిచిన రోజులుగా జామ్ క్యాండీ స్క్వాష్‌ను తయారు చేయడంపై గిరిజన యువ రైతులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ప్యాకింగ్ లేబులింగ్, ఫుడ్ రిజిస్ట్రేషన్, పర్సనల్ హైజినిక్ నేర్పించడం జరిగిందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన యువ రైతులు ఈ శిక్షణలు సద్వినియోగం చేసుకొని మంచి ఉపాధి అవకాశంగా ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, గిరిజన రైతు మహిళలు, రైతులు పాల్గొన్నారు.



ఇసుక ర్యాంప్ రహదారికి ట్రెంచ్‌లు తవ్వుతున్న జెసిబి

ఇసుక ర్యాంపులకు రోడ్లు బంద్

ఆమదాలవలస : మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా తహశీల్దార్ కె.వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపుల రహదారులన్ని మూసి వేయించారు. బుధవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిరీష విఆర్ఒ, విఆర్‌ఎలతో కలిసి కొత్తవలస, తొగరాం, దూసి, తోటాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల పరిసర ప్రాంతమైన నాగావళి నది ఇసుక ర్యాంపులకు వెళ్లే రహదారులను గుర్తించి జెసిబితో రహదారికి అడ్డంగా వాహన రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ట్రెంచ్‌లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు వచ్చేవరకు ఎవరైనా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పోలాకి: పోలాకి సత్యసాయి మందిరం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యాధికారి నిఖిత 93 మంది నేత్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 31 మందికి నేత్ర ఆపరేషన్ అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా మందిరం కన్వీనర్ బరాటం రామారావు, ఆప్తలమిక్ ఆఫీసర్ రత్నం రాజు, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎన్.అప్పలరాజు, క్యాంపు కో-ఆడినేటర్ ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిఖిత

అందరి సహకారంతో నేర నియంత్రణ



మాట్లాడుతున్న బదిలీపై వెళ్లిన ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో సుమారు రెండున్నరేళ్ల ఎస్‌పిగా పనిచేసిన జి.ఆర్.రాధికకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం శ్రీకాకుళం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పోలీసు యంత్రాంగం ఎస్‌పి రాధికకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్‌పిలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తాను చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమని, మరువులేనదని గుర్తు చేశారు. ప్రధానంగా హోంగార్డ్స్ నుంచి అదనపు ఎస్‌పి వరకు అందించిన సహకారం ద్వారా జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా చేయగలిగమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో, క్లిష్టమైన బందోబస్తు విధులు నిర్వహించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినంద నీయమన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు ప్రతిఒక్కరి కృషితో సాధ్యమైందని అందరం కలిసికట్టుగా పనిచేయడం వలనే అన్నింట సక్సెస్ కాగలగాలిగామన్నారు. ఇదే సాంప్ర దాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత ఎస్‌పి మహేశ్వర రెడ్డికి సహకారం అందించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్ కాజల్, ఉమ మహేశ్వరరావు, డి.గంగాధర్, నెహ్రు యువజన అధికారి ఉజ్వల్, డిఎస్‌పిలు బాలచంద్ర రెడ్డి, శృతి, త్రినాధరావు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, శేషాద్రి, ఎఒ గోపీనాథ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాదశి వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం గొంటి పంచాయతీ లంకపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ శుద్ధ ఏకాదశి (శయన ఏకాదశి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆయనకు ఆలయ కమిటీ స్వాగతించారు. స్వామివారికి నిర్వహించే సేవల్లో ఆయన పాల్గొన్నారు. టిడిపి నాయకులు గొండు వెంకటరమణ మూర్తి, గోర సురేష్ పాల్గొన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

పచ్చిరొట్టతో ప్రకృతి వ్యవసాయం

ఆమదాలవలస: రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో కొంతమంది ఔత్సాహిక మహిళా రైతులు తమ పొలంలో పచ్చిరొట్ట ఎరువులతో ప్రకృతి వ్యవసాయానికి నాంది పలుకు తున్నారని వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మండలంలోని వెదుళ్లవలస పంచాయతీలో ప్రై మూన్ డ్రై సీజన్ తొలకరి వర్షాలకు సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడారు. ఈ మొక్కలను భూమిలో కలిపి దమ్ము చేయడం ద్వారా పచ్చిరొట్ట కుళ్లి భూమిని సారవంతం చేస్తూ రసాయన ఎరువులు వాడకుండా భూమిని సార వంతంగా ఉంచి రైతుకు లాభదాయకమవు తుంద న్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సిసి రామప్పడుతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'దువ్వాడ' పరామర్శ

టెక్కలి రూరల్ : మండలంలో పోలవరానికి చెందిన మాజీ ఎంపిపి దవళ రమేష్ కుమారుడు రాజేంద్ర ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకొని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఈయనతో పాటు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్ కుమార్, శిగిలిపల్లి మోహనరావు, పినకాన వైకుంఠరావు, జగన్నాథస్వామి ఆలయ చైర్మన్ నర్సింగ్ సాభత్, విశ్వనాథం ఉన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెంటిభద్రకు చెందిన సవర గోవింద్ ఇటీవల పాము కాటుకు గురయ్యారు. దీంతో పలాసలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గోవింద్‌ను పరామర్శించారు. అనంతరం వైద్యులతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, వైసిపి నాయకులు, వైద్యులు ఉన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయం సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం దర్శించుకున్నారు. పురోహితులు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు పూర్ణకుంభంతో వేదమంత్రో చ్చారణల మధ్య స్వాగతం పలికారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి రాధాకృష్ణ, టిడిపి కార్యాకర్తలు పాల్గొన్నారు.

గోకుల షెడ్డు నిర్మాణానికి రాయితీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాడి రైతులు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం దారులకు షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ అందించేందుకు పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీతో నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఆవుల షెడ్డు నిర్మాణానికి షెడ్ ఖరీదులో 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లషెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీతో ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. రెండు ఆవుల కోసం షెడ్డు నిర్మాణం చేపడితే ప్రభుత్వ వాటాగా రూ.లక్షా 15వేలు యూనిట్ కాస్ట్ ఉంటుందని, లబ్ధిదారుని వాటా రూ.11, 500, నాలుగు ఆవులు షెడ్డు నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ. లక్షా 85 వేలు, లబ్ధిదారుల వాటా రూ.18, 500, ఆరు ఆవులకు షెడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల 30 వేలు కాగా లబ్ధిదారుని వాటా రూ.23 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే 20 గొర్రెలు, మేకల షెడ్ యూనిట్ కాస్ట్ రూ.లక్షా 30 వేలుకాగా, లబ్ధిదారుని వాట రూ.39 వేలు, 50 మేకలు, గొర్రెలు షెడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల 30 వేలు కాగా, లబ్ధిదారుల వాటా రూ. 69 వేలు చెల్లించాలని, 100 కోళ్లపెంపకం చేపట్టే షెడ్‌కు యూనిట్ కాస్ట్ రూ.87 వేలుకాగా లబ్ధిదారుల వాటా రూ.26, 100, రెండు వందల కోళ్ల షెడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ.లక్షా 32వేలుకాగా లబ్ధిదారుల వాటా రూ.39,600 చెల్లించాలన్నారు. ఈ పథకం పొందేందుకు సొంత స్థలం, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం వర్తిస్తుందని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 2014-19 మధ్య కాలంలో టిడిపి అధికారంలో ఉండగా గోకుల షెడ్ల నిర్మాణాల కోసం డిడిలు కట్టి షెడ్డు నిర్మాణం చేపట్టిన రైతులకు బిల్లులు అందకపోతే స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన



అయ్యవారిపేట వద్ద కాలువ పనులు పరిశీలిస్తున్న శంకర్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నియోజకవర్గంలో ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకు సాగునీరందించే లక్ష్యంతో సాగునీటి కాల్వల మరమ్మతు పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం నియోజక వర్గ పరిధిలో జరుగుతున్న కాలువలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ప్రధానంగా గ్రామీణ మండలంలో పలు గ్రామాలకు సాగునీరందిచేందుకు ఏర్పాటు చేసిన రామిగెడ్డ ప్రధాన కాలువ పనులను ఖాజీపేట వరకు పరిశీలించారు. కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంశధార కుడి కాలువ ద్వారా అందిస్తున్న సాగునీటిని ముందుగా చెరువులను నింపుకునేందుకు వీలుందని, నీటిని నిల్వ చేయడం ద్వారా వ్యవసాయ పనులకు నీటికొరత తీర్చుకునేందుకు వీలవుతుందన్నారు. అయ్యవారి పేట నుంచి శ్రీకూర్మం, దల్లం వరకు వంశధార కాలువ పనులు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. వంశధార, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

గత ప్రభుత్వ హయాంలో దళితులకు సంబంధించిన రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను పునరు ద్ధరించి దళితుల అభివృద్ధికి తోడ్పడాలని సమతా సైనిక దళ్ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త దేబరికి రామాప్పుడు ప్రభుత్వానికి కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గత ప్రభుత్వం దళితులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టిందని, దానిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చల్లా రామారావు సమత సైనికులు నాయకులు అధికరణ మహేష్, పందిరి లోకేష్, బుడ్డా సత్యం, బడియ నాగేశ్వరరావు, పాండురంగ శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజులును కలిసిన వైశ్య నాయకులు



చిత్రపటాన్ని అందజేస్తున్న వైశ్యులు

పాతపట్నం: మండలంలోని తెంబూరు, గంగువాడ, బడ్డుమర్రి, చిన్నగుజ్జవాడ వైశ్యులు కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులును కలిశారు. కోటబొమ్మాళి మండలంలోని ఆయన స్వగ్రామానికి మంగళవారం రాత్రి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన వైశ్య సంఘానికి ప్రభుత్వ తరపున అన్ని విధాలా న్యాయం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పిర్క వైశ్య సంఘం అధ్యక్షుడు పోట్నూరు గజపతిరావు, ఉపాధ్యక్షుడు బోయిన పార్వతీశం, సెక్రటరీ నందాల శనివాసరావు, జాయింట్ సెక్రెటరీ కోట్ని తేజేశ్వరరావు, మధుబాబు, బోయిన చంద్రమౌళి, బోయిన సోమేశ్వరరావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటాచలం

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనర్ వెంకటాచం అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరజాడ నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకట్రావు అధ్యక్షతన గురువారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల పేరిట ఫోన్లు చేసి ఒటిపిలు, పిన్ నంబర్లు చెప్పమని కోరితే చెప్పరాదన్నారు. లాటరీలు పేరుతో ఫోన్లు చేసి వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదని తెలిపారు. విద్యార్థులుగా మొబైల్ ఫోను వినియోగం చేసేటప్పుడు ఇతర యాప్‌లను ఇతర లింకులను ప్రెస్ చేయరాదన్నారు. అనంతరం వినియోగదారుల ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, టి.గోపాలకృష్ణ, సిహెచ్.ఆదినారాయణ, రామారావు, ఎస్.బాలరాజు, టి.శ్రీనివాసరవు, పి.అర్జున్, యతి రాజారావు, దీనబంధు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సహారా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

గత పదేళ్లుగా తాము చేసిన పొదుపు డబ్బుల కోసం పోరాడుతున్న సహారా ఇండియా బాధితులకు న్యాయం చేయాలని బాధితులు, ఏజెంట్లు కోరారు. ఈ మేరకు మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సహారా బాధితులకు సుమారు రూ.500 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. ఆర్థిక నేరాల ఆరోపణలతో సహారా ఇండియా కంపెనీపై కేసు నమోదైన నుంచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కరించి తమ పొదుపు డబ్బులు తమకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.సత్యరాజు, పి.సత్యనారాయణ, బి.రమణ, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో పనులు చేస్తున్న రైతులు

శ్రమదానంతో చెరువు మరమ్మతులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంల్లో బెల్లుపడా వద్ద ఈదుపురం వెళ్లే దారిలో ఉన్న కాయి అప్పలమ్మ చెరువు మరమ్మతు పనులకు రైతులు బుధవారం శ్రమదానం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి ఏమాత్రం అవకాశం ఉన్నా నీటి వనరులు సద్వినియోగం చేసుకోవాలి. ఆ ఆలోచనతో రైతులు ముందుకొచ్చారు. ప్రొక్లెయినర్‌తో మూడు రోజుల పాటు మరమ్మతులు పనులు చేయనున్నారు.